RNI: TELTEL12215

https://youtube.com/@PrabhathasuryuduNews

https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు

జాతీయ తెలుగు దినపత్రిక

www.prabhathasuryudu.com

RANGAREDDY, EDITION : 01, VOLUME :184 EDITOR: CHERUKU UPENDAR, DATE : SUNDAY 19 NOVEMBER 2023 PAGES:4 RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 184 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : ఆదివారం 19 నవంబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-

## రేపు తెలంగాణలో ప్రియాంక గాంధీ పర్యటన

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ రేపు తెలంగాణకు రానున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ అగ్రనేతలు జోరుగా ప్రచారం చేస్తున్నారు. ఎన్నికలకు మరో పది రోజుల సమయం మాత్రమే ఉంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ నుంచి ఆయా పార్టీల

మిగతా 2లో

## మధ్య ప్రాచ్యంలో ఏకాభిప్రాయం అవసరం

### గాజాలో పౌరుల మరణాలకు మోదీ ఖండన



**న్యూఢిల్లీ-ప్రభాతసూర్యుడు:** గాజాలో ఘర్షణల నేపథ్యంలో మధ్య ప్రాచ్యంలో తలెత్తిన పరిస్థితులతోపాటు కొత్తగా ఆవిర్భవిస్తున్న సవాళ్లను పరిష్కరించడానికి ఏకాభిప్రాయాన్ని సాధించాలని ప్రధాని నరేంద్ర మోడీ వర్ధమాన దేశాల నేతలకు విజ్ఞప్తి చేశారు. రెండవ 'వాయిస్ ఆఫ్ గ్లోబల్ సౌత్' సదస్సుకు భారత్ ఆతిథ్యం ఇస్తోంది. శుక్రవారం ఈ సదస్సును ప్రారంభిస్తూ మోడీ ప్రసంగించారు. గాజాలో జరుగుతున్న యుద్ధంలో అమాయకులైన ప్రజలు మరణించడాన్ని భారత్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. పరిస్థితులను సంయమనంతో ఎదుర్కొనాలని, దానితోపాటు చర్చలు, దౌత్యం కూడా అవసరమని ఆయన నొక్కి చెప్పారు. పాలస్తీనా అథారిటీ అధ్యక్షుడు మహ్మద్ అబ్బాస్‌తో మాట్లాడిన తర్వాత భారత్ కూడా మానవతా సాయం పంపిందని చెప్పారు. మరింత విస్తృతమైన మంచి,


మిగతా 2లో

# ఓటే వజ్రాయుధం

- బీజేపీ, కాంగ్రెస్ పద్ధతి లేని పార్టీలు..
- బీఆర్ఎస్ పుట్టిందే తెలంగాణ కోసం
- సంక్షేమ పథకాల అమలులో మనమే టాప్
- మరో పదేండ్లలో రైతే రాజు అవుతాడు

### చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేస్తా : సీఎం కేసీఆర్


చేర్యాల- ప్రభాత సూర్యుడు



ఓటే వజ్రాయుధమని, అభ్యర్థి గుణగణాలు, పార్టీ చరిత్ర చూసి ఓటు వేయాలని సీఎం కేసీఆర్ అన్నారు. సిద్దిపేట జిల్లా చేర్యాల మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ పుట్టింది తెలంగాణ రాష్ట్రం కోసం అని అన్నారు. ఓటు వేయడం ద్వారా ఐదేండ్ల మన తలరాతను మనమే నిర్ణయించుకుంటామని, అందుకే వజ్రాయుధాన్ని ప్రజలు సరైన రీతిలో వినియోగించుకోవాలని కోరారు. రాష్ట్రాన్ని సాధించి అభివృద్ధి చేస్తుంటే ప్రతిపక్ష పార్టీలు ఇప్పుడు వచ్చి ఎన్నికల్లో గెలిపిస్తే రాష్ట్రాన్ని ఇంకా ఏదో చేస్తామని ప్రగల్భాలు పలుకుతున్నారని విమర్శించారు. రాష్ట్రాన్ని సాధించిన బీఆర్ఎస్‌కు రాష్ట్ర అభివృద్ధి చేయడం తెలుసని అన్నారు. రాష్ట్రాన్ని ముంచింది కాంగ్రెస్ పార్టీయే అని, హైదరాబాద్ రాష్ట్రాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విలీనం చేసి తెలంగాణలో వేల మంది ప్రాణాలు బలిగొన్న పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాల అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని, తెలంగాణలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కెసిఆర్ కిట్, రైతుబంధు, రైతు బీమా

మిగతా 2లో

## కరోనా మరోసారి విజృంభించనుందా?




**లండన్-ప్రభాత సూర్యుడు:** ప్రపంచాన్ని వణికించిన కరోనా వైరస్.. మరోసారి విజృంభించేందుకు సిద్ధంగా ఉందని వైద్య నిపుణలు హెచ్చరిస్తున్నారు. తాజాగా ఒమిక్రాన్ వేరియంట్ నుంచి పుట్టుకొచ్చిన బీఏ.2.86 వేరియంట్ లేదా పిరోలా ప్రస్తుతం బ్రిటన్‌లో వేగంగా వ్యాప్తి చెందుతోంది. బహుశా ఈ వేరియంట్ ప్రభావం భారత్‌లో కూడా ఉండనుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ వైరస్ సోకినవారు బాగా అలసటకు గురవుతారు. అలాగే నొప్పులు, జ్వరం, ముక్కుకారటం, గొంతునొప్పి, కళ్లలో మంట, చర్మంపై దద్దుర్లు కనిపిస్తాయని, శ్వాసకోశ వ్యవస్థను ప్రభావితం చేస్తుందని వైద్యులు చెబుతున్నారు. కాగా, ఈ కొత్త వేరియంట్ వేగంగా వ్యాప్తి చెందుతుందని.. ఇప్పటికే ఈ వేరియంట్ కేసులు బ్రిటన్‌లో అధికంగా నమోదవుతున్నాయని యూకే హెల్త్ సెక్యూరిటీ ఏజెన్సీ (యూకేహెచ్ఎస్ఏ) తెలిపింది. ఈ వ్యాధిని

మిగతా 2లో

## విజయవంతంగా నింగికెగిసిన ప్రపంచంలోనే అతిపెద్ద రాకెట్



**హైదరాబాద్- ప్రభాత సూర్యుడు:** టెక్ దిగ్గజం 'స్పేస్‌ఎక్స్' ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన 'స్టార్‌షిప్' భారీ రాకెట్ విజయవంతంగా నింగిలోకి ఎగిసింది. స్థానిక కాలమానం ప్రకారం.. శనివారం (నవంబరు 18) ఉదయం దక్షిణ టెక్సాస్ తీరం నుంచి ఈ ప్రయోగం చేపట్టింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో స్టార్‌షిప్ మొదటి టెస్ట్‌ఫ్లైట్ విఫలమైన విషయం తెలిసిందే. గాల్లోకి ఎగిరిన కేవలం 4 నిమిషాలకే గల్ఫ్ ఆఫ్ మెక్సికోలో ఇది కూలిపోయింది. దీంతో తొలి ప్రయోగంలోని వైఫల్యాలను విశ్లేషించి.. రాకెట్, ల్యాంచ్ ప్యాండ్‌లను మరింత అభివృద్ధి చేసింది. అమెరికా గగనతల నిర్వహణ సంస్థ సూచించిన 57 మార్పులూ చేపట్టింది. ఎఫ్ఏఏ అనుమతి అనంతరం ఈ

మిగతా 2లో

# గజ్వేల్‌లో ఓటమి భయంతోనే.. కామారెడ్డిలో పోటీ

### ఎన్నికల ప్రచారంలో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి

రాజంపేట- ప్రభాత సూర్యుడు



రాష్ట్రంలో మార్పు రావాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షులు రేవంత్ రెడ్డి అన్నారు. నియంత, అవినీతి, కుటుంబ పాలనను బొంద పెడితేనే రాష్ట్రంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉంటారని అన్నారు. శనివారం కామారెడ్డి జిల్లాలోని రాజంపేట్, భిక్కనూర్ మండల కేంద్రాల్లో రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణను తాగుబోతుల రాష్ట్రంగా మార్చిందని, గ్రామగ్రామాల్లో బెల్ట్ షాపులను ఏర్పాటు చేసి ప్రభుత్వం అందజేస్తున్న పింఛన్ రూ.2016ను మద్యం దుకాణాల ద్వారా తీసుకుంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతు భరోసా పథకం ద్వారా ప్రతి రైతుకు, కౌలు రైతుకు ఎకరానికి రూ.15000 అందజేస్తుం దని, భూమిలేని రైతులకు, ఉపాధి కూలీలకు సంవత్సరానికి రూ.12,000 చెల్లిస్తుందన్నారు. బీఆర్ఎస్ కచరా పాలనలో వ్యవసాయ బావుల వద్ద ఉచిత కరెంటు అని చెప్పి గృహ నివాసాల నుంచి వేల రూపాయలు వసూలు చేస్తున్నారని అన్నారు. కేసీఆర్‌ను ఓడించి బీఆర్ఎస్ పార్టీని బొందపెట్టి ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేయడానికి కేసీఆర్‌పై కామారెడ్డి నుంచి పోటీ చేస్తున్నానని తెలిపారు. కేసీఆర్ గజ్వేల్‌లో ఓడిపోతాననే భయంతోనే కామారెడ్డిలో పోటీ చేస్తున్నాడని విమర్శించారు. కేసీఆర్ 40 ఏండ్ల రాజకీయ జీవితంలో అమ్మమ్మ ఇల్లు గుర్తుకు రాలేదని.. ఎన్నికలు రాగానే కామారెడ్డి నియోజకవర్గంలో ఉన్న అమ్మమ్మ గారి ఇల్లు గుర్తుకు వచ్చిందని ఎద్దేవా చేశారు.

మిగతా 2లో

## భారత్ ప్రపంచకప్ గెలిస్తే.. రూ.100 కోట్లు పంపిణీ చేస్తా




**హైదరాబాద్-ప్రభాతసూర్యుడు:** క్రికెట్ అభిమానులు ఎంతో ఎదురుచూస్తున్న వన్డే ప్రపంచకప్ ఫైనల్ ఆదివారం భారత్-ఆస్ట్రేలియా మధ్య జరగబోతోంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో ఈ తుది సమరం అంగరంగ వైభవంగా జరగనుంది. ఫైనల్‌లో టీమిండియా గెలవాలని అభిమానులు ప్రత్యేకంగా పూజలు చేయిస్తున్నారు. మరోవైపు టీమిండియా కచ్చితంగా విశ్వవిజేతగా నిలుస్తుందని విశ్వసిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఫైనల్‌కు కొన్నిగంటల ముందు ఆస్ట్రోటాక్ సీఈవో పునీత్ గుప్తా సంచలన ప్రకటన చేశారు. ఆస్ట్రేలియాతో జరిగే ప్రతిష్టాత్మక ఫైనల్ పోరులో భారత్ గెలవాలని తాను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు. ఒకవేళ ఫైనల్లో భారత్ గెలిస్తే తమ కంపెనీ వినియోగదారులకు రూ.100 కోట్లు పంపిణీ చేస్తానని ఆయన స్పష్టం చేశారు. కాగా 2011లో టీమిండియా ప్రపంచకప్ గెలిచిన సమయంలో తాను కాలేజీలో చదువుకుంటున్నానని.. తన జీవితంలో

మిగతా 2లో

# అవినీతిరహిత పాలన అందిస్తాం

### ఆవిష్కరణలో కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు




తెలంగాణలో తాము అధికారంలోకి వస్తే వరి ధాన్యం క్వింటాకు రూ.3,100 మద్దతు ధర ఇస్తామనీ, రైతులకు విత్తనాలు కొనుగోలు చేసేందుకు రూ.2500 ఇన్‌ఫుట్ అసిస్టెన్స్ అందజేస్తామని కేంద్ర హెూంమంత్రి అమిత్‌షా ప్రకటించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మాదిరిగానే పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్‌ను ఎత్తేస్తామని చెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని హెూటల్ కత్రియాలో బీజేపీ ఎన్నికల మ్యానిఫెస్టో-2023ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, బీజేపీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జులు ప్రకాశ్ జవదేకర్, తరుణ్‌చుగ్, కేంద్ర అధికార ప్రతినిధి జాఫర్ ఇస్లాం, నేతలు ప్రకాశ్‌రెడ్డి, సుభాష్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమిత్‌షా మాట్లాడుతూ.. చేసేదే చెప్పటం, చెప్పిందే చేయటం బీజేపీ నైజం అన్నారు. తమను గెలిపిస్తే తెలంగాణ అభివృద్ధికి, ప్రజల

మిగతా 2లో



భారతీయ విద్యా భవన్ పబ్లిక్ స్కూల్ రిటైర్డ్ ప్రిన్సిపల్ పులిపాక రామ హనుమాన్ చిరకాల మిత్రుడైన ప్రభాత సూర్యుడు దిన పత్రిక చీఫ్ ఎడిటర్ కస్తా శంకర్ రావును పటాన్ చెరులోని ఆయన స్వగృహంలో స్నేహ పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారిరువురు తెలంగాణ రాష్ట్ర తాజా రాజకీయ, జరగబోయే అసెంబ్లీ ఎన్నికల పరిణామాలను చర్చించుకున్నారు.

- పటాన్ చెరు, ప్రభాత సూర్యుడు

## కరోనా మరోసారి విజృంభించనుందా?

(మొదటిపేజీ తరువాయి)

ఎదుర్కొనేందుకు ముందు జాగ్రత్తగా టీకాల ప్రచారాన్ని యూకేహెచ్ఎస్ఏ ముమ్మరం చేసింది. కరోనా టీకా బూస్టర్ డోసు తీసుకోని వారు వెంటనే ఈ డోస్ తీసుకోవాలని వైద్యాధికారులు ప్రజలకు సూచించారు. ముఖ్యంగా రద్దీ ప్రదేశాలకు దూరంగా ఉండాలని, మాస్క్ తప్పనిసరిగా ధరించాలని వైద్యులు సూచిస్తున్నారు. గత జూలై నెలలో బీఏ.2.86 కేసులు నమోదయ్యాయి.

## విజయవంతంగా నింగికెగిసిన ప్రపంచంలోనే అతిపెద్ద రాకెట్

(మొదటిపేజీ తరువాయి)

ప్రయోగం చేపట్టింది. తాజా ప్రయోగంలో రాకెట్ గాల్లోకి ఎగిరిన 2.48 నిమిషాల తర్వాత బూస్టర్ విజయవంతంగా విడిపోయింది. దాదాపు గంటన్నర పాటు సాగనున్న ఈ టెస్ట్ ఫ్లైట్‌లో భాగంగా.. ప్రయోగం ప్రారంభంలో విడిపోయే బూస్టర్‌ను గల్ఫ్ ఆఫ్ మెక్సికోలో పడేలా చర్యలు తీసుకున్నారు. స్పేస్‌క్రాఫ్ట్ మాత్రం భూమి చుట్టు దాదాపు ఒక పరిభ్రమణం సాగించి, పసిఫిక్ మహాసముద్రంలో పడిపోయేలా తయారుచేశారు. రెండు సెక్షన్ల (బూస్టర్, స్పేస్‌క్రాఫ్ట్) ఈ 'స్టార్‌షిప్' రాకెట్ పొడవు ఏకంగా 121 మీటర్లు(400 అడుగులు) ఉండటం గమనార్హం. ప్రపంచంలోనే అతిపెద్ద రాకెట్‌గా పేరుపొందిన దీన్ని.. చందమామ, అంగారకుడిపై యాత్రలకు వీలుగా 'స్పేస్ఎక్స్ రూపొందించింది.

## భారత్ ప్రపంచకప్ గెలిస్తే.. రూ.100 కోట్లు పంపిణీ చేస్తా

(మొదటిపేజీ తరువాయి)

అత్యంత ఆనందక్షణాల్లో అదొకటి అని ఆస్ట్రోటాక్ సీఈవో పునీత్ గుప్తా అన్నారు. అలాంటి ఆనందం మరోసారి దక్కాలని కోరుకుంటున్నానని పునీత్ పేర్కొన్నారు. అందుకే ఈసారి మన దేశం ప్రపంచకప్ గెలిస్తే ఆ ఆనందాన్ని తమ యూజర్లతో కలిసి పంచుకోవాలనే తాను రూ.100 కోట్లు పంపిణీ చేస్తానని ప్రకటించినట్లు పునీత్ వివరించారు.

## బిజెపి పరువు పోయింది

### గాంధీభవన్‌లో సినీనటి విజయశాంతి



**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు:** " బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి సంజయ్ ను తొలగించవద్దని కోరాం. సంజయ్ ను తొలగించడంతో బిజెపి పరువు పోయింది " అని విజయశాంతి ధ్వజమెత్తారు. శనివారం గాంధీభవన్‌లో సినీనటి విజయశాంతి మాట్లాడుతూ ... మళ్లీ కాంగ్రెస్‌లోకి రావడం సంతోషంగా ఉందని అన్నారు. కెసిఆర్ అవినీతిపై చర్యలు తీసుకుంటామని బిజెపి చెబితే ఆ పార్టీలోకి వెళ్లానని అన్నారు. ఏళ్లు గడచినా ఆ మేరకు చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఆధారాలు ఉండి కూడా బిజెపి ఎందుకు చర్యలు తీసుకోలేదు ? అని ప్రశ్నించారు. బిజెపి, బిఆర్ఎస్ రెండూ ఒక్కటేననీ.. తెరపై విమర్శలు.. తెర వెనుక ఒప్పందాలు చేసుకున్నాయని వ్యాఖ్యానించారు. బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి సంజయ్ ను తొలగించవద్దని కోరామనీ.. సంజరును తొలగించడంతో బిజెపి పరువు పోయిందని విజయశాంతి దుయ్యబట్టారు.

# మధ్య ప్రాచ్యంలో ఏకాభిప్రాయం అవసరం

(మొదటిపేజీ తరువాయి)

ప్రయోజనాల కోసం వర్ధమాన దేశాలన్నీ ఒకే వాణిని వినిపించాలని ఆయన కోరారు. 'సంప్రదింపులు, సహకారం, కమ్యూనికేషన్, సృజనాత్మకత, సామర్థ్యాల రూపకల్పన" వంటి సూత్రాలను అనుసరించడం ద్వారా "ఒక భూగోళం, ఒక కుటుంబం, ఒక భవిష్యత్తు" అన్న భారత్ నేతృత్వంలోని జి-20 థీమ్ కోసం అందరమూ కృషి చేయాలని అన్నారు. అక్టోబరు 7న ఇజ్రాయిల్‌పై హమస్ జరిపిన ఆకస్మిక దాడులను భారత్ వెంటనే ఖండించింది. తీవ్రవవాద చర్య అంటూ ముద్ర కూడా వేసింది. గాజాలోని ఆస్పత్రిపై జరిగిన క్షిపణి దాడిలో 500మందికి పైగా మరణించిన ఘటనను కూడా భారత్ తీవ్రంగా ఖండించింది.

ఘర్షణలు, యుద్ధాల్లో పౌరులు బలి కాకూడదని, వారి ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన ఆవశ్యకత వుందని మోడీ పేర్కొన్నారు. గ్లోబల్ సౌత్‌లోని పలు దేశాలు కూడా ఇజ్రాయిల్ చర్యను తీవ్రంగా ఖండించాయి. చిలీ, కొలంబియా, హొండూరస్ దేశాల అధ్యక్షులు ఇజ్రాయిల్ ప్రతిస్పందిస్తున్న తీరును తీవ్రంగా గర్హించారు. గాజాలో మానవాళికి వ్యతిరేకంగా ఘోరమైన దారుణాలు, నేరాలు జరుగుతున్నాయని వారు విమర్శించారు. పలు ఆఫ్రికా దేశాలు కూడా ఇజ్రాయిల్‌ను విమర్శించాయి. తక్షణమే అంతర్జాతీయ సమాజం స్పందించి, చర్యలు తీసుకోవాల్సిన అవసరం వుందని నొక్కి చెప్పాయి.

### ఇజ్రాయిల్ యుద్ధ నేరాలపై ఐసిసి విచారణ చేపట్టాలి : సిరిల్ రమాఫోసా

ఇజ్రాయిల్ యుద్ధ నేరాలపై అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసిసి) విచారణ చేపట్టాలని దక్షిణాఫ్రికా పిలుపునిచ్చింది. ఇజ్రాయిల్ అమానవీయ దాడులను తాము చూస్తున్నామని దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమాఫోసా గురువారం మీడియాకి విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ దాడులపై విచారణ చేపట్టాలని కోరుతున్న ఇతర దేశాలు, సంస్థలతో కలిసి సంయుక్తంగా ఐసిసిని విచారణ చేపట్టాల్సిందిగా కోరుతున్నామని అన్నారు. గాజాలో అతిపెద్దదైన అల్-షిఫా ఆస్పత్రిని ఇజ్రాయిల్ దళాలు దిగ్బంధించడంతో పాటు ఆహారం, నీరు, విద్యుత్ వంటి సదుపాయాను అడ్డుకుంటున్నాయని మండిపడ్డారు. అక్టోబర్ 7 నుండి ఇజ్రాయిల్ చేపట్టిన దాడుల్లో గాజా, వెస్ట్‌బ్యాంకులలో సుమారు 11,517 మంది పాలస్తీనియన్లు మరణించగా, 32,000 మంది గాయాలపాలయ్యారు.

ఇంత తక్కువ సమయంలో ఎంతో మంది అమాయకమైన చిన్నారులను బలిగొన్న యుద్ధాలను చరిత్రలో చూడలేదని అన్నారు. గాజాలో నిర్బంధ శిబిరంపై మారణహోమం అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనేనని రమాఫోసా పునరుద్ఘాటించారు. తక్షణమే కాల్పుల విరమణ ప్రకటించేలా, పాలస్తీనాలోని సాధారణ పౌరులను రక్షించేలా చర్యలు చేపట్టాలని అంతర్జాతీయ సమాజానికి పిలుపునిచ్చారు. ఇజ్రాయిల్ నుండి తమ దౌత్యవేత్తలందరినీ వెనక్కి పిలవనున్నట్లు గతవారం దక్షిణాఫ్రికా అధ్యక్షుడు ప్రకటించిన సంగతి తెలిసిందే.

### శరణార్ధ శిబిరంపై దాడి : 18మంది మృతి

గత కొద్ది గంటల వ్యవధిలో ఇజ్రాయిల్ జరుపుతున్న వైమానిక దాడుల్లో పాలస్తీనా పౌరులు డజన్ల సంఖ్యలో మరణించారని పాలస్తీనా వాఫా వార్తా సంస్థ తెలిపింది. ఖాన్ యూనిస్‌లోని ఇంటిని లక్ష్యంగా చేసుకుని జరిపిన దాడిలో నలుగురు మరణించగా, బని సుహేలియా ప్రాంతంలో ఇంటిపై జరిగిన దాడిలో పలువురు చనిపోయారు. సెంట్రల్ గాజాలోని నుస్రత్ శరణార్ధ శిబిరంపై దాడిలో 18మంది పౌరులు మరణించారు. జాబాలియా శరణార్ధ శిబిరంపై దాడిలో డజన్ల సంఖ్యలో పౌరులు చనిపోయారు. వేలాదిమంది నిర్వాసితులు వున్న పాఠశాలపై కూడా గత రాత్రి దాడి జరిగింది. గాజాలో కమ్యూనికేషన్ సేవలు స్తంభించడంతో ఉదయానికి గానీ సమాచారం తెలియలేదని గాజాలోని ఇండోనేషియా ఆస్పత్రి సిబ్బంది చెప్పారు. అల్ షిఫా ఆస్పత్రి పెద్ద జైలుగా మారిందని, లోపల వున్నవారందరికీ మూకుమ్మడి సమాధిగా తయారైందని అల్‌షిఫా ఆస్పత్రి డైరెక్టర్ మహ్మద్ అబూ సాల్మియా వ్యాఖ్యానించారు. ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో వున్న వారందరూ చనిపోయారని చెప్పారు. ఆస్పత్రిని వీడేందుకు అనుమతించాల్సిందిగా వేడుకున్నామని, కానీ ఇజ్రాయిల్ బలగాలు తిరస్కరించాయని చెప్పారు.

# అవినీతిరహిత పాలన అందిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

సమస్యల పరిష్కారానికి పనిచేస్తామని చెప్పారు. బీజేపీ మ్యానిఫెస్టో అంశాలు ప్రధాని మోడీ ఇస్తున్న హామీలు అన్నారు. ఓడిపోయే వాళ్ళు ఓడిపోతామని ఒప్పుకోరు కదా.. అందుకే మేమే గెలుస్తామని చెప్పుకుంటున్నారు అని కేసీఆర్ ప్రభుత్వానుద్దేశించి వ్యాఖ్యానించారు. ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, జార?ండ్ రాష్ట్రాలను చుక్క రక్తపాతం లేకుండా నాటి వాజ్‌పేయి ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. కానీ, తెలంగాణ ఏర్పాటుకు కాంగ్రెస్ ఎంతో మంది యువకులను బలితీసుకున్నదని విమర్శించారు. 2004 నుంచి 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షల కోట్ల నిధులను ఇస్తే..బీజేపీ తొమ్మిదున్నరేండ్లలో ఒక్క తెలంగాణకే రూ.2.5 లక్షల కోట్లను కేటాయించిందని వివరించారు. తెలంగాణకు గిరిజన యూనివర్సిటీ, పసుపుబోర్డు, ఎయిమ్స్, తదితరాలను ఇచ్చామనీ, నేషనల్‌హైవేలు, గ్రీన్‌ఫీల్డ్ హైవే వేశామని చెప్పారు. హైదరాబాద్ మెట్రోకు రూ.1200 కోట్ల కంటే ఎక్కువ నిధులు ఇచ్చామనీ, అంతర్జాతీయ విమాశ్రయం వరకు దాన్ని విస్తరణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఓవైసీకి భయపడి విమోచన దినోత్సవాన్ని కేసీఆర్ నిర్వహించలేదన్నారు. కేసీఆర్ లోక్‌తంత్రాన్ని వదిలి..దోపిడీ తంత్రాన్ని నమ్ముకుని పనిచేస్తున్నారని విమర్శించారు. కేటీఆర్‌ను సీఎం చేయడమే లక్ష్యంగా ఆయన ముందుకెళ్తున్నారని చెప్పారు. నీళ్లు, నిధులు, నియామకాల హామీల్లో ఒక్కటీ నెరవేరలేదని విమర్శించారు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని అప్పుల్లోకి నెట్టారన్నారు. తెలంగాణలో ప్రతి ప్రాజెక్టులోనూ కమీషన్లు ఇవ్వాల్సిందేనని ఆరోపించారు. టీఎస్‌పీఎస్సీ పరీక్ష పేపర్లను లీక్ చేసి యువత భవిష్యత్తుతోని రాష్ట్ర సర్కారు ఆడుకున్నదని విమర్శించారు. కేజీ టూ పీజీ విద్య, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణం ఇలా ఏ ఒక్కటీ ఆచరణలో చేసి చూపెట్టలేదన్నారు. లిక్కర్, గ్రానైట్, మిషన్ కాకతీయ.. ఇలా ప్రతి పథకంలో అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. తాంత్రికులు చెప్పారని.. కేసీఆర్ పార్టీ పేరు మార్చారన్నారు. గ్యాస్ సిలిండర్ల తగ్గింపు అంశంపై రాష్ట్ర, కేంద్ర సర్కార్ రెండు కలిసి తగ్గిస్తే.. పేదలపై భారం పడదనీ, కేసీఆర్ ఎందుకు తగ్గించడం లేదని ప్రశ్నించారు. బీసీ సీఎం నినాదం నచ్చకనే రాజగోపాల్‌రెడ్డి, విజయశాంతి, వివేక్ పార్టీని వీడారని విమర్శించారు. వాళ్ల కోసం తమ పార్టీ విధానాలను మార్చుకోబోమన్నారు. కేసీఆర్ తమ పార్టీలో కోవర్టులు ఉన్నారంటున్నారనీ, మరి కేసీఆర్ కూడా టీడీపీ వ్యక్తే కదా అని అన్నారు. డిసెంబర్ 3 తర్వాత తెలంగాణలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.

### క్వింటా వరికి రూ.3,100 ఇస్తాం

- హైదరాబాద్ విమోచన దినోత్సవంగా సెప్టెంబర్ 17ని అధికారికంగా ప్రకటిస్తాం.
- బైరాన్‌పల్లి, పరకాలలో రజాకార్ల ఆకృత్యాల్లో మరణించిన వారిని స్మరించుకుంటూ ఆగస్టు 27న రజాకార్ల దుష్కృత్యాల సంస్మరణ దినంగా గుర్తిస్తాం.
- నిజాంకు వ్యతిరేకంగా పోరాడిన వారిని స్మరించుకుంటూ హైదరాబాద్‌లో స్మారక స్థూపం, మ్యూజియం ఏర్పాటు చేస్తాం.
- అవినీతిరహిత పాలన అందిస్తాం. కేసీఆర్ ప్రభుత్వ అవినీతిపై సుప్రీం కోర్టు రిటైర్డ్ జడ్జితో విచారణ కమిటీ వేస్తాం.
- బీసీని సీఎంగా చేస్తాం.
- ఎస్సీ వర్గీకరణను వేగం చేసేందుకు సహకరిస్తాం.
- మతపర రిజర్వేషన్లను తొలగించి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు వాటిని వర్తింపజేస్తాం.
- ద్రవ్యోల్బణం తగ్గిస్తాం. సామాన్యులకు ఊరట కలిగించేలా పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్ ఎత్తేస్తాం.
- ఇప్పుడిస్తున్న ఎరువుల సబ్సిడీ(రూ.18వేలు)తో విత్తనాలు కొనుగోలు చేసేందుకు రూ.2,500 ఇన్‌ఫుట్ అసిస్టెన్స్ అందిస్తాం.
- పసుపు బోర్డు ఏర్పాటు నేపథ్యంలో ప్రాసెసింగ్ యూనిట్లను కూడా ఏర్పాటు చేసి ఉపాధి కల్పనకు బాటలు వేస్తాం.
- వరికి మద్దత ధర క్వింటాకు రూ.3,100 ఇస్తాం. తెలంగాణలో ఉత్పత్తయ్యే బియ్యాన్ని కొనుగోలు చేస్తాం.
- ప్రధానమం త్రి ఫసల్ బీమా యోజన ద్వా రా రైతులకు ఉచిత పం ట బీమా కల్పిస్తాం.
- ఉజ్వ ల లబ్దిదారులకు ఏడాదికి ఉచితంగా నాలుగు గ్యా స్ సిలిండర్లు
- నవజాత ఆడపిల్లలపై ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తాం. 21 ఏండ్లు వచ్చాక రూ.2 లక్షలు పొందొచ్చు.
- డిగ్రీ, ఉన్నత చదువులు చదివే విద్యార్థునులకు ఉచితంగా ల్యాప్‌ట్యాప్‌లు
- స్వయం సహాయక బృందాలకు రూపాయి వడ్డీకే రుణాలు
- యూసీఎస్సీ తరహాలోనే గ్రూపు-1, గ్రూపు-2 ఉద్యోగాలను టీఎస్‌పీఎస్సీ ద్వారా ఆరు నెలలకోసారి భర్తీ చేస్తాం.
- ఆసక్తి గల రైతులకు ఆరోగ్య కరమైన ఆవును ఉచితంగా అందిస్తాం.
- అర్హత గల కుటుంబాలకు ఏడాదికి రూ.10 లక్షల ఉచిత ఆరోగ్య కవరేజీ. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఏడాదికోసారి ఉచిత వైద్య పరీక్షలు.
- కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా న్యాయబద్ధంగా దక్కేలా రాష్ట్రం తరఫున ట్రిబ్యునల్‌లో వాదనలు వినిపిస్తాం. - ఉద్యోగస్తులు, పింఛనర్లకు ప్రతినెలా ఒకటో తేదీనే వేతనాలు అందేలా చూస్తాం.
- ఉమ్మడి పౌరస్మృతి ముసాయిదా రూపొందించేందుకు కమిటీ ఏర్పాటు చేస్తాం.
- గ్రామాల్లోని అర్హులైన పేదలకు ఇంటి పట్టాలను అందిస్తాం.
- వయోవృద్ధులకు ఉచితంగా అయోధ్య, కాశీ యాత్ర.
- తెలంగాణకు చెందిన ఎన్నారైలు, గల్ఫ్ నివాసితుల సంక్షేమం కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు.

# కాంగ్రెస్‌ను నమ్మితే అధోగతే.. : మంత్రి కేటీఆర్

## కామారెడ్డి నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం

**దోమకొండ - ప్రభాత సూర్యుడు**

ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని మేనిఫెస్టోలో పెట్టిన కాంగ్రెస్ పార్టీని నమ్మితే ప్రజల బతుకులు అధోగతి పాలవుతాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ అన్నారు. ధరణిని తీసేస్తే లంచగొండుల, పైరవీకారుల దందా మొదలవుతుందని తెలిపారు. 55 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజలు, రైతులు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. మళ్ళీ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే రాష్ట్రం అంధకారంలోకి పోతుందని చెప్పారు. రైతులు, ప్రజల సంక్షేమానికి కృషిచేస్తున్న సీఎం కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. శనివారం కామారెడ్డి నియోజకవర్గంలోని భిక్కనూర్ మండలం పెద్దమల్లారెడ్డి, కాచాపూర్ గ్రామాలతో పాటు, బీబీపేట్ మండల కేంద్రం, మాందాపూర్ గ్రామంలో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 42 పేజీలతో 420 అబద్దాల మేనిఫెస్టోను కాంగ్రెస్ ప్రవేశపెట్టిందని ఎద్దేవా చేశారు. ధరణిని రద్దు చేస్తే




రైతులకు రైతు బీమా, పంటల పెట్టుబడి ఎలా వస్తుందని ప్రశ్నించారు. ఢిల్లీ దొరలు కావాలో గల్లీ లీడర్ కావాలో మీరే తేల్చుకోవాలని తెలిపారు. రాష్ట్రంలో రైతుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత విద్యుత్ అందజేస్తూ పలు పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్, ఎంపీ బీబీపాటిల్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు తిమ్మాయగారి సుభాష్ రెడ్డి, జడ్పీ వైస్ చైర్మెన్ ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

### తెలంగాణ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయి

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, షబ్బీర్ అలీలు విద్యుత్ విషయంలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కామారెడ్డిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కేటీఆర్ మాట్లాడుతూ%'%% కాంగ్రెస్ హయాంలో విద్యుత్ కష్టాలు అందరికీ తెలిసిందే అన్నారు. తెలంగాణలో 24 గంటల విద్యుత్ ఎక్కడిది? అని ప్రశ్నిస్తున్నారని, కామారెడ్డిలో పోటీ చేస్తున్న రేవంత్ రెడ్డి విద్యుత్ తీగలు పట్టుకుంటే కరెంట్ ఉందా? లేదా? తెలుస్తుందని చురకలు అంటించారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక విద్యుత్ కష్టాలు తీరాయన్నారు. అందుకే మన వద్ద వరి సాగు పెరిగిందన్నారు. తెలంగాణలో అమలవుతోన్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి అవుతున్నారని, ఈ ఎన్నికల్లో గెలిచాక కొత్త పెన్షన్లు, కొత్త రేషన్ కార్డులు ఇస్తామని చెప్పారు.

## సంపాదకీయం

# 75 శాతం కోటకు చెక్

ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించడం ఎప్పటి నుంచో జరుగుతూనే ఉంది. కానీ ప్రైవేటు రంగంలో మాత్రం రిజర్వేషన్లు కల్పించడం వివాదాలకు కారణమవుతోంది. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల కల్పనకు ప్రభుత్వాలు చేస్తున్న ప్రయత్నాలకు చెక్ పెడుతూ హైకోర్టు తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. ప్రైవేటు రంగంలో 75 శాతం స్థానిక కోటా కల్పిస్తూ హర్యానా ప్రభుత్వం మూడేళ్ల క్రితం తీసుకున్న నిర్ణయాన్ని పంజాబ్, హర్యానా హైకోర్టు ఇవాళ కొట్టేసింది. ప్రైవేట్ రంగంలోని ఉద్యోగాల్లో హర్యానా లో స్థానికులకు 75శాతం రిజర్వేషన్లు తప్పనిసరి చేసే వివాదాస్పద హర్యానా చట్టాన్ని పంజాబ్, హర్యానా హైకోర్టు కొట్టివేసింది. అంతే కాదు ఇది రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంది. హర్యానా స్టేట్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫ్ స్థానిక అభ్యర్థుల చట్టం 2020లో గతంలో పలు మార్పుల్ని ప్రభుత్వం అసెంబ్లీలో పెట్టి ఆమోదించింది. కేసీఆర్, మోడీపై మల్లిఖార్జున ఖర్గే విమర్శలు ఇందులో నెలవారీ జీతం రూ.30,000 కంటే తక్కువ వేతనాలతో 75 శాతం ప్రైవేట్ రంగ ఉద్యోగాలు స్థానికంగా నివసిస్తున్న వారు లేదా నివాస ధృవీకరణ పత్రం కలిగి ఉన్న వారికి కేటాయించాలని నిర్ణయించారు. అలాగే స్థానికులుగా నిర్ధారించేందుకు గతంలో ఉన్న 15 ఏళ్ల కాలాన్ని ఐదేళ్లకు తగ్గించారు. హర్యానాలో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది. దీంతో ఈ ప్రైవేటు రంగంలో స్థానిక ఉద్యోగాల కోటాతో లబ్ది పొందాలని బీజేపీ-జేజేపీ సంకీర్ణ ప్రభుత్వం భావించింది. అయితే హైకోర్టు నిర్ణయంతో ఇప్పుడు ఆ చట్టం కాస్తా రద్దయింది. స్థానికుల ఓట్లను ఏకీకృతం చేసే లక్ష్యంతో మనోహర్ లాల్ ఖట్టర్ నేతృత్వంలోని ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ నిర్ణయాన్ని హైకోర్టు కొట్టేయడం పెద్ద ఎదురుదెబ్బగా భావిస్తున్నారు. ఈ తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీలు చేసేందుకు సిద్ధమవుతోంది. దేశవ్యాప్తంగా కుల గణన పై గత మూడు నెలలుగా రాజకీయ చర్చ మొదలైంది. ఇది వరకే రాష్ట్ర స్థాయిలో బిహార్లో కుల గణనను చేపట్టిన నితీశ్ కుమార్ ప్రభుత్వం ప్రస్తుతం 50 శాతం ఉన్న రిజర్వేషన్లను 67 శాతానికి పెంచడానికి నిర్ణయించుకుంది. కులగణన ద్వారా సేకరించిన విద్య సాంఘిక ఆర్థిక గణాంకాలు ప్రకారంగా 16% ఉన్న ఎస్సీ రిజర్వేషన్లను 20%, 1% ఉన్న ఎస్టీ రిజర్వేషన్లు 2 శాతానికి, 30 శాతం ఉన్న ఓబీసీ ఈబీసీ రిజర్వేషన్లు 43% పెంచనున్నట్లు బీహార్ ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికే ఒడిస్సా ప్రభుత్వం కులగణనను మొదలు పెట్టగా ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్గఢ్, మధ్యప్రదేశ్, కర్ణాట క ప్రభుత్వాలు త్వరలో కులగణనను చేస్తామని ప్రకటించాయి.కులగణన ప్రధాన లక్ష్యం కులాలవారీగా సామాజిక-, ఆర్థిక విద్యాపరమైన గణాంకాలను అందించడమే. వివిధ కులాలు ఎదుర్కొంటున్న విశేష సౌకర్యాలు లోటు పాట్లను అర్థం చేసుకోవడానికి కుల గణన సహాయం చేస్తుంది. అందరికీ మరింత సమానమైన సమాజం కోసం కులగణన దోహద పడుతుంది. అయితే కులగణనకు సంబంధించి భిన్నాభిప్రాయాలు, విమర్శలు వస్తున్నాయి. ఇది సమాజాన్ని కులం, జాతి ఆధారంగా మరింతగా విభజించవచ్చని కొందరు వాదిస్తారు. మరికొందరు కొన్ని కులాల సంభావ్య కళంకం గురించి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ, కులం అనేది ఒక అపోహ కాదు, కుల ఆధారిత వివక్ష దౌర్జన్యాలు దేశాన్ని పీడిస్తున్నాయని గుర్తించడం చాలా అవసరం.కుల గణన అనేది ఖచ్చితమైన డేటా, సమాచారాన్ని అందించడానికి, అసమానతలను తగ్గించడానికి, పేదరికం నిర్మూలించడానికి దోహదం చేస్తుంది. అసమానతలను తగ్గించడం లక్ష్యంగా సాగించే కులగణన, ఇది వరకే ఉన్న విధానాలలోని హానికరమైన లోపాలను సవరించడమే కాకుండా, కొత్త విధానాలను కూడా రూపొందించి, కుల వ్యవస్థను నిర్మూలించి మరింత మెరుగైన, న్యాయమైన సమాజాన్ని నిర్మించడానికి దోహదపడుతుంది. కులగణన వల్ల ప్రభుత్వాలకు రిజర్వేషన్లను సక్రమంగా అమలు చేయడానికి, వివిధ అసమానతలను తొలగించడానికి కావాల్సిన గణాంకాలను తెలియజేస్తుందన్న అంశాన్ని అందరూ గుర్తు పెట్టుకోవాలి.ఎప్పటి నుంచో కుల గణనను చేపట్టాలని వాదిస్తున్న బీసీ సంఘాల న్యాయబద్ధమైన పోరాటాలకు కాంగ్రెస్ పార్టీ సుముచితంగా స్పందించి కుల గణన అంశాన్ని ఇప్పుడు జరుగుతున్న వివిధ రాష్ట్రాల ఎన్నికల్లో, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన అంశంగా లేవనెత్తుతుంది. రాహుల్ గాంధీ ప్రతి ఎన్నిక సభల్లో కులగణనను లేవనెత్తుతూ సామాజిక న్యాయం చేసే బాధ్యత మేము తీసుకుంటామని హామీ ఇస్తున్నారు. ఇది కచ్చితంగా బీసీల పట్ల, సామాజిక న్యాయం పట్ల కాంగ్రెస్ పార్టీ మారిన వైఖరిని ప్రతిబింబిస్తుంది. ఇండియా అలయన్స్ లోని పార్టీలన్నీ కులగణనకు సానుకూలంగా స్పందించాయి. 2018లో, హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ మొదటిసారిగా జనాభా గణనలో ఓబీసీ కులాలను చేర్చడాన్ని నిర్ధారిస్తూ ఒక ముఖ్యమైన ప్రకటన చేసింది. అప్పటి హోంమంత్రి రాజ్నాథ్సింగ్ మీడియా సమావేశంలో అధికారికంగా ఈ విషయాన్ని తెలియజేశారు. అయితే, 2019 సార్వత్రిక ఎన్నికల తర్వాత బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వ వైఖరి గణనీయమైన మార్పుకు గురైంది. బిహార్ కులగణన కేసులో సుప్రీంకోర్టులో, కేంద్ర ప్రభుత్వం కౌంటర్ అఫిడవిట్తో ప్రతిస్పందిస్తూ, కుల గణనను నిర్వహించే అధికారం కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే ఉందని, జనాభా గణనకు సంబంధించిన అంశాలు యూనియన్ జాబితా కిందకు వస్తాయి అన్నారు.

## రేవంత్ రెడ్డి హెలికాప్టర్‌లో సాంకేతిక లోపం

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు : టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి హెలికాప్టర్‌లో శనివారం సాంకేతిక లోపం తలెత్తింది. సాంకేతిక లోపం రావడంతో టీపీసీసీ అధ్యక్షుడి హెలికాప్టర్ ప్రయాణం రద్దయింది. దీంతో రోడ్డు మార్గంలో రేవంత్ రెడ్డి కామారెడ్డికి బయలుదేరారు. కామారెడ్డి నియోజకవర్గంలో ఈ రోజు మూడు సభలలో పాల్గొనవలసి ఉంది. రోడ్డు మార్గంలో రావడంతో సభలకు ఆయన ఆలస్యంగా వచ్చే అవకాశముంది. ఆయన తన సొంత నియోజకవర్గం కొడంగల్‌తో పాటు ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కామారెడ్డిలోనూ పోటీ చేస్తున్నారు.

# రామగుండంలో రణరంగం



అదిలాబాద్ - ప్రభాత సూర్యుడు : తెలంగాణ వ్యాప్తంగా ఎన్నికల కోలాహలం ఊపందుకుంటోంది. పోలింగ్‌కు సమయం సమీపిస్తున్న కొద్దీ, రాజకీయ సమరం రసవత్తరంగా మారుతోంది. అభ్యర్థులంతా విజయమే లక్ష్యంగా విస్తృత ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఓటర్లలో పట్టు కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఎవరికి వారు ప్రచారంలో దూసుకు వెళ్తుండడంతో, విజయం ఎవరిదనే అంశంపై పలుచోట్ల అంతుచిక్కని పరిస్థితి నెలకొంది..గతంలో ఎన్నడు లేని విధంగా పెద్దపెల్లి జిల్లా రామగుండం నియోజకవర్గంలో ఈసారి రాజకీయ రణ రంగానికి వేదికగా మారింది. నువ్వా.. నేనా.. అనే రీతిలో అభ్యర్థులు కొనసాగిస్తున్న హోరాహోరీ ప్రచారాలతో ఇక్కడి ఎన్నికలు రసవత్తరంగా మారాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా గట్టి పోటీ ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. వరుసగా మూడు ఎన్నికల్లో పోటీ చేసి, గత ఎన్నికల్లో విజయం సాధించిన సిట్టింగ్ ఎమ్మెల్యే కోరుకంటి చందర్,ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా నాలుగవసారి ఎన్నికల బరిలో నిలిచారు. వరుసగా రెండు పర్యాయాలు పరాజయం పాలైన మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్, కాంగ్రెస్ అభ్యర్థిగా మూడవ సారి తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. సుదీర్ఘకాలంగా ఃఖీూ పార్టీలో ఉండి అనూహ్యంగా ఆ పార్టీని వీడిన జిఖుఅ కందుల సంధ్యారాణి బీజేపీ అభ్యర్థిగా ఎన్నికల సమరానికి సై అంటున్నారు.ప్రధాన పార్టీలకు చెందిన ఈ ముగ్గురు నాయకులు ప్రచారంలో పోటీ పడుతుండగా, స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ వీరికి ధీటుగా ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. కేసీఆర్ సంక్షేమ పథకాలు, రామగుండంలో తాను సాధించిన అభివృద్ధి ఎన్నికల్లో తనను మళ్ళీ గెలిపిస్తాయని ఃఖీూ అభ్యర్థి కోరుకంటి చందర్ బలంగా భావిస్తుండగా, కేసీఆర్ సర్కార్ పట్ల, స్థానిక ఎమ్మెల్యే పట్ల ప్రజల్లో ఉన్న వ్యతిరేకత, రెండు మార్లు పరాజయం పాలైన నేపథ్యంలో ప్రజల నుండి లభిస్తున్న సానుభూతి తన విజయానికి దోహదపడతాయని కాంగ్రెస్ అభ్యర్థి మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ధీమా వ్యక్తం చేస్తున్నారు.ఇక, భారతీయ జనతా పార్టీ అందుకున్న బీసీ నినాదంతో పాటు మహిళా అభ్యర్థిగా స్థానికులంతా తన వైపే నిలిచి గెలిపిస్తారనే అంచనాలతో బీజేపీ అభ్యర్థి కందుల సంధ్యారాణి ముందుకెళ్తున్నారు. ప్రధాన పార్టీలకు చెందిన ఈ ముగ్గురు అభ్యర్థులకు గట్టి పోటీ ఇచ్చేలా, స్వతంత్ర అభ్యర్థి సోమారపు సత్యనారాయణ ముమ్మర ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. గతంలో తాను సాధించిన అభివృద్ధిని చూసి ప్రజలు తనకే పట్టం కడతారని ప్రగాఢ విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారు సోమారపు సత్యనారాయణ. ఇలా ఎవరి అంచనాలతో వారు పోటాపోటీ ప్రచారాలతో ప్రజల్లో పట్టు కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితులను బట్టి రామగుండంలో చతుర్ముఖ పోటీ తప్పదని పరిశీలకులు భావిస్తున్నారు.ఇదిలావుంటే, ఎన్నికల వేళ అనూహ్యంగా మారిన రాజకీయ సమీకరణాలు ప్రస్తుతం రామగుండంలో హాట్‌టాపిక్‌గా మారాయి. ఎన్నికల నగారా మోగే వరకు ఃఖీూ పార్టీలో ఉన్న కందుల సంధ్యారాణి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తుండడం, గడిచిన ఐదేళ్లుగా బీజేపీ పార్టీలో కొనసాగిన సోమారపు సత్యనారాయణ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తుండడం చర్చనీయాంశంగా మారింది. ఈ ఇద్దరికీ లభించే ఓట్లు రామగుండంలో గెలుపు ఓటములను ప్రభావితం చేసే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఃఖీూ అభ్యర్థి కోరుకంటి చందర్, కాంగ్రెస్ అభ్యర్థి రాజ్ ఠాకూర్ మధ్య ప్రధాన పోటీ కొనసాగుతుందని పలువురు భావిస్తుండగా, ఆ రెండు పార్టీలకు ధీటుగా బీజేపీ అభ్యర్థి కందుల సంధ్యారాణి, స్వతంత్ర అభ్యర్థి సోమారపు సత్యనారాయణ కూడా గట్టి పోటీని ఇవ్వనున్నట్లు మరికొందరు అంచనా వేస్తున్నారు.అయితే వీరిద్దరూ ఃఖీూ ఓట్లను చీలుస్తారా..? కాంగ్రెస్ ఓట్లను చీలుస్తారా..? అనే అంశంపై ఆసక్తికరమైన చర్చ కొనసాగుతోంది. అంతుచిక్కకుండా ఉన్న ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో అంతిమంగా రామగుండం విజేత ఎవరనే అంశం అందరిని తీవ్ర ఉత్కంఠకు గురిచేస్తోంది. మొత్తంగా, రామగుండంలో ఎవరు గెలిచినా.. స్వల్ప మెజారిటీతోనే విజయం సాధిస్తారనే అభిప్రాయాలు సర్వత్ర వ్యక్తం అవుతున్నాయి.ఇక పాలమూరు పరిధిలో ఎక్కువమంది యువత పోటీ చేస్తున్నారు.

# ఎన్నికల సమయంలో బహుజనులు అప్రమత్తంగా ఉండాలి

- కార్పొరేట్ శక్తులను కొమ్ముకాసే పార్టీలను ఓడించాలి
- బహుజన వాదాన్ని బలపరిచే బి.ఎం.పి పార్టీకి అవకాశము ఇవ్వండి
- బి ఎంపీ శేరిలింగంపల్లి అభ్యర్థి రాములు విజ్ఞప్తి



హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు : బహుజనులు చైతన్యవంతంగా మారకపోతే ఎన్నేళ్ళు అయిన రాజ్యాధికారం దక్కించుకోవడం అసాధ్యమని బహుజన ముక్తి పార్టీ,ప్రజా పార్టీ బలపరిచిన అభ్యర్థి కొండపల్లి రాములు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో బిజెపి రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో పేదరికం గణనీయంగా పెరిగిందని అన్నారు. కార్పొరేట్ శక్తులు, బడా పారి శ్రామికవేత్తలు మునుపేన్నడు లేనంతగా కోటీశ్వరులుగా మారారని ధనికులకు, పేదలకు మధ్య వ్యత్యాసం అమాంతంగా పెరగడం ఆందోళన పరిణామన్నారు, ఈ నేపథ్యంలో జరుగుతున్న ఎన్నికలు సమాజ స్థితిగతులను మార్చేవుగా మారాయన్నారు ఓటర్లు వ్యక్తితో ఓటేసి బహుజనుల ప్రయోజనాలకు కృషి చేస్తున్న బహుజన ముక్తి పార్టీని గెలిపించాలని కోరారు.రాష్ట్రానికి అత్యధిక ఆదాయం ఇస్తున్న శేర్లింగంపల్లి నియోజకవర్గం లో కూడు గూడు లేని నిరుపేదల అధికంగా ఉన్నారని వారందరూ ప్రయోజనాల కోసం పోరాటం చేస్తానన్నారు అచ్చంపేట నియోజకవర్గంలో అత్యంత పేదరికం తాండవిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. పౌష్టికాహారం లోపంతో చాలామంది అనారోగ్యాలు బారిన పడుతున్నారని విచారం వ్యక్తం చేశారు ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ ఓటర్లు ఆలోచించి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు నిరుపేదలకు కూడు గూడు కోసం నిరంతరంగా పోరాటం చేస్తానని హామీ ఇచ్చారు. తనకు టికెట్ కేటాయించిన దాసరి అజయ్ కుమార్ యాదవ్ ధన్యవాదాలు తెలిపారు.

# నియోజకవర్గాల్లో నోట్ల కట్టలు



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు : జకీయం ఇప్పుడు వ్యాపారంగా మారిపోయిందని ప్రజాస్వామిక వాదులు బాధపడుతూ ఉంటారు. దీనికి కారణం ఎన్నికల ఖర్చు. సాధారణంగా ఎన్నికల్లో ఖర్చు చేయడానికి రూ. 40 లక్షల వరకూ పరిమితి ఉంది. కానీ ఈ ఖర్చు ఒక్క రోజుకు కూడా సరిపోతుందా లేదా అని లెక్కలేస్తే కష్టమే. ఖర్చులు ఊహించనంతగా పెరిగిపోయాయి. అసలు ఖర్చులు వేరు తెర వెనుక ఖర్చులు వేరు. అదీ ప్రతిష్టాత్మక నియోజకవర్గాల్లో అయితే నోట్ల కట్టల వరద పారాల్సిందే. ఇప్పుడు అదే వాతావరణం చాలా నియోజకవర్గాల్లో కనిపిస్తోంది. రాజకీయ పార్టీలు రూ.కోట్లు ఖర్చు చేయగల అభ్యర్థులను బరిలో దింపడంతో ఎన్నికలు చాలా ఖరీదైనవిగా మారాయి. ఒక్కో నియోజకవర్గంలో సుమారు రూ.100 కోట్లుకుపై మాటే ఖర్చు చేయడానికి అభ్యర్థులు సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తోంది. ప్రధానంగా అర్బన్ ప్రాంతమైన శేరిలిగంపల్లి, రాజేందర్‌నగర్, మహేశ్వరం, ఎల్‌బీనగర్, తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల్లో ఎన్నికల ఖర్చు కోట్లల్లో ఉండనుందని చెప్పుకుంటున్నారు. ఇతర నియోజకవర్గాల్లో ఖర్చు యాభై కోట్లు దాటిపోతుంది. ఈ సారి రిజర్వుడు నియోజకవర్గాల్లోనూ భారీగా ఖర్చు పెట్టబోతున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న ములుగులో ఈ సారి డబ్బు ప్రభావం ఎక్కువగా కనిపిస్తోందని ఇప్పటికే చెప్పుకుంటున్నారు. తనను ఓడించడానికి రెండు వందల కోట్లు ఖర్చు పెట్టబోతున్నారని సీతక్క ఆరోపిస్తున్నారు. పూర్తిగా గిరిజన ప్రాంతమైన ఆ నియోజకవర్గంలో అంత ఖర్చు పెడితే మిగతా కీలక నియోజకవర్గాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అంచనా వేయవచ్చు. డబ్బు ఎంత ఖర్చు అనేది కాదు.. గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు ఎన్నికల ప్రచారం కొనసాగిస్తున్నారు. ప్రచార కూలి నుంచి అగ్రనాయకత్వం వరకు ఎవరినీ వదలకుండా డబ్బులతో కొనుగోలు చేస్తున్నారు. కుల సంఘాలు మొదలుకుని, ప్రభుత్వ ఉద్యోగ సంఘాలతోనూ బేరసారాలు చేస్తున్నారు. వార్డు మెంబర్ల నుంచి రాష్ట్ర స్థాయి నేత వరకు రేటు కడుతున్నారు. మరోవైపు ఎన్నికల ప్రచారానికి పెరిగిన సాంకేతికను ఉపయోగించుకుంటున్నారు. డిజిటల్ మొబైల్స్ ద్వారా ప్రచారం మొదలు, ఇంటింటికీ కరపత్రం పంపిణీ చేసేందుకు కూలి వరకు డబ్బులు పే చేయాల్సిందే. ఒక పార్టీ అభ్యర్థి ప్రచార కూలికి రూ.500 ఇస్తే.. మరో పార్టీ అభ్యర్థి రూ. వెయ్యి ఇచ్చేందుకు కూడా వెనకాడటం లేదు.ఎన్నికల ఖర్చులో తగ్గేదేలేదని అభ్యర్థులు పోటీ పడి మరీ డబ్బులు కుమ్మరిస్తున్నారు. ఇంటింటికీ? పార్టీ గుర్తును, మ్యానిఫెస్టోను ప్రచారం చేసే వ్యక్తికి ఇక్కడ రోజుకు రూ. 1500 నుంచి 2000 వరకు ఖర్చు చేస్తున్నారు. ఎన్నికల బరిలో నిలిచిన రియల్ ఎస్టేట్ వ్యాపారుల నియోజకవర్గాల్లో డబ్బులే రాజకీయం చేస్తున్నాయి. మహేశ్వరం నియోజకవర్గం అర్బన్, సెమీ అర్బన్ ప్రాంతమైనప్పటికీ ఎన్నికల ఖర్చు అర్బన్ ప్రాంతాన్ని మించనుందని ఆయా పార్టీల శ్రేణులు చెబుతున్నాయి. బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే మంత్రి సబితాఇంద్రారెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, బీజేపీ అభ్యర్థి శ్రీరాములు ముగ్గురి మధ్య తీవ్ర పోటీ ఉంది. ఎంతైనా ఖర్చు పెట్టేందుకు అభ్యర్థులు సిద్ధమయ్యారు. వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గంలో బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి మనోహర్‌రెడ్డి మధ్య ప్రచారంలో కాసుల వర్షం కురుస్తోంది. కొండగల్ నియోజకవర్గంలో టీపీసీసీ రేవంత్‌రెడ్డి గెలుపు కాంగ్రెస్‌కు ప్రతిష్టాత్మకం కావడంతో అక్కడ కూడా డబ్బు ప్రభావం తీవ్రంగా ఉండనుంది. రేవంత్‌ను ఓడించేందుకు బీఆర్ఎస్ సైతం ఎంతైనా ఖర్చు చేసేందుకు సిద్ధమైనట్టు చెప్పుకుంటున్నారు. ఇక్కడ పోటాపోటీగా డబ్బు ఖర్చు చేస్తున్నారు.ఎన్నికల సంఘం ఐదు వందల కోట్ల వరకూ పట్టుకున్నామని లెక్కలు చెబుతోంది. కానీ అదంతా సామాన్యుల డబ్బే. రాజకీయ నేతల డబ్బు మాత్రం.. నియోజకవర్గాలకు క్షేమంగా వెళ్లిపోతోంది. ఖర్చుల్లో ఎక్కడా తగ్గకపోవడమే దీనికి సంకేతం. డబ్బు రవాణాకు ఇప్పుడు అనేక మార్గాలున్నాయి. వాటిని ఈసీ కూడా ఆపలేకపోతోంది. కానీ సామాన్యులు మాత్రం.. తనిఖీల్లో ఎక్కువ నష్టపోతున్నారు.

## ఇబ్రహీంపట్నంలో ఎగిరేది కాషాయ జెండానే

### నోముల దయానంద్ గౌడ్


ఆదిభట్ల - ప్రభాత సూర్యుడు



గత 25 ఏళ్ల నుండి కాంగ్రెస్, బీఆరెస్ పాలనతో ప్రజలు విసిగిపోయి ఉన్నారని ప్రజలు ప్రత్యమ్యాయం కోరుకుంటున్నారని ఆదిబట్ల మునిసిపాలిటి పరిధిలో జరిగిన బిజెపి ఎన్నికల ప్రచార కార్యక్రమంలో నోముల దయానంద్ గౌడ్ తెలిపారు. రైతులు, యువత ఆత్మహత్యలకు పాల్పడుతుంటే కేసీఆర్ కు దున్నపోతు మీద వానపడ్డట్టే ఉందని, ఇంతమంది ప్రజల్ని పొట్టన బెట్టుకున్న బీఆరెస్ ప్రభుత్వానికి ఓటు వేస్తే మన కళ్ళు మనమే పొడుచుకున్నట్లవుతుందని, మన పిల్లల భవిష్యత్ కోసం, విద్యకోసం, ఉద్యోగాల కోసం బిజెపికి ఓటువేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బొంగళూర్ క్రాస్ రోడ్, బొంగళూర్ విలేజ్, ఆదిబట్ల, పటేల్ గూడ, సాహెబ్‌గూడ, కొంగర కలాన్, మంగళపల్లి, మలిశెట్టి గూడ, రాందాస్ పల్లి ప్రాంత గ్రామాల్లో యాత్ర పెద్ద ఎత్తున సాగింది. ఈ కార్యక్రమంలో బిజెపి వనపర్తి జిల్లా ఇంచార్జ్ బోసుపల్లి ప్రతాప్, రంగారెడ్డి జిల్లా జనరల్ సెక్రటరీ అర్జున్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షులు దరావత్ శ్రీనివాస్ నాయక్, ఆదిబట్ల మునిసిపాలిటీ బిజెపి అధ్యక్షులు వీరాస్వామి గౌడ్, నారాయణ యాదవ్, లక్ష్మీపతి, అశోక్ గౌడ్, ప్రశాంత్, జూకంటి శ్రీరాములు, ఆదిమూలం మహేష్ చారి, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్‌లో ఎవరిది "పై" చెయ్యి!

**వజ్రేష్ వర్సెస్ మల్లారెడ్డి పోటా పోటీ ప్రచారం**
**బీఆర్ఎస్ అభ్యర్థి వైఫల్యాలే కాంగ్రెస్‌కు ప్రధానాస్త్రాలు**
**తమవైపే జనం పాజిటివ్‌గా ఉన్నారని హస్తం నేత వ్యాఖ్యలు**
**నేతలు వీడుతున్నా భయం లేదంటున్న గులాబీ పార్టీ**



నవతెలంగాణ-బోడుప్పల్ - ప్రభాత సూర్యుడు :

మేడ్చల్‌లో రాజకీయం వేడెక్కుతోంది. కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేష్ యాదవ్, బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి మల్లారెడ్డి ఒకరిని మించి ఒకరు ఎన్నికల ప్రచారం హోరెత్తిస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఎవరిది "పై" చెయ్యి అనే రీతిలో ఎన్నికల ప్రచారం సాగుతోంది. ప్రభుత్వ వైఫల్యాలతో పాటుగా అధికార పార్టీ అభ్యర్థిపై ఉన్న అవినీతి ఆరోపణలనే కాంగ్రెస్‌పార్టీ ప్రధానాస్త్రాలుగా చేసుకుంది. తమవైపే జనం పాజిటివ్‌గా ఉన్నారని, ఎంతోమంది తమ పార్టీలో చేరుతున్నారని హస్తం నేతలు ధీమాతో ఉన్నారు. ఎంతమంది నేతలు కారును వీడినా భయం లేదని గులాబీ పార్టీ నేతలు తెలిపారు. అధికార పార్టీ వైఫల్యాలు, బీఆర్ఎస్ అభ్యర్థి మల్లారెడ్డిపై ఉన్న అవినీతి ఆరోపణలు, ఆగడాలపైనే కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి వజ్రేష్ యాదవ్ ఎక్కుపెట్టారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేయబోయే "ఆరు గ్యారంటీ"లను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుపోతున్నారు. గతంలో రెండు సార్లు ఎమ్మెల్యేగా పోటి చేసి ఓటమి చెందిన వజ్రేష్ యాదవ్ కు కొంత సానుభూతి ఉందన్న అభిప్రాయాన్ని విశ్లేషకులు వ్యక్తపరుస్తున్నారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఏ ఒక్కరిని కదిలించినా అందరి నోటా కాంగ్రెస్ పార్టీకి పాజిటివ్‌గా ఉందనే మాట వినిపిస్తున్నదని ఆ పార్టీ నేతలు చెబుతున్న మాట. మల్లారెడ్డి ఏ రోజు పాలనపై దృష్టి పెట్టలేదని కేవలం స్వంత ప్రయోజనాల కోసమే పదవిని ఉపయోగించుకున్నాడనే విమర్శలు ఉన్నాయి. మల్లారెడ్డిపై సొంత పార్టీ నేతలే బహిరంగ విమర్శలు చేయడం కూడా కాంగ్రెస్‌కు అనుకూలంగా మారే అవకాశం లేకపోలేదని అంటున్నారు. బలహీన పడుతున్న బీఆర్ఎస్.. అదేమీ లేదంటున్న గులాబీ పార్టీ మల్లారెడ్డి ఏకపక్ష నిర్ణయాలు ఆయన కుటుంబ సభ్యుల పెత్తనంతో విసుగుపోతున్న బీఆర్ఎస్ క్యాడర్ క్రమక్రమంగా పార్టీని వీడుతున్నారు. ఇప్పటికే బోడుప్పల్ కార్పొరేషన్ నుండి బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఐదుగురు కాంగ్రెస్ పార్టీలోకి వెళ్ళారు. ఘటకేసర్ నుంచి ఆరుగురు కౌన్సిలర్లు మారిపోయారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, మాజీ ప్రజాప్రతినిధులు ఇలా ఎంతోమంది కాంగ్రెస్‌లోకి చేరుతుండడంతో బీఆర్ఎస్ పార్టీ బలహీన పడుతుందనే వాదనలు వినిపిస్తున్నాయి. అయితే ఎంతమంది పార్టీని వచ్చే నష్టం ఏమీ లేదని, సంక్షేమ పథకాలు అందుకున్న జనం తమవైపు ఉన్నారని గులాబీ పార్టీ నేతలు చెప్పుకుంటున్నారు.

## హైదరాబాద్ శివారులో రూ.6 కోట్లు నగదు పట్టివేత

నవతెలంగాణ-బోడుప్పల్ -ప్రభాత సూర్యుడు :

తెలంగాణలో ఎన్నికల వేళ హైదరాబాద్ నగర శివారులో తనిఖీల్లో భారీగా నగదు పట్టుబడింది. ఓఆర్ఆర్ అప్పా కూడలి వద్ద శనివారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఆరు కార్లలో భారీగా తరలిస్తున్న నగదును పోలీసులు గుర్తించారు. సరైన పత్రాలు లేని దాదాపు రూ.6 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

# బిఆర్ఎస్ సంక్షేమ పథకాలే ప్రభుత్వాన్ని గెలిపిస్తాయి

**బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మంచిరెడ్డి కిషన్ రెడ్డి**

యాచారం - ప్రభాత సూర్యుడు




శాసనసభ ఎన్నికలలో భాగంగా యాచారం మండలంలోని గడ్డ మల్లయ్య గూడెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మంచిరెడ్డి కిషన్ రెడ్డి ప్రచారం వేగం పెంచారు. శనివారం నాడు రోడ్ షోలో భాగంగా ఆయా గ్రామాలలో మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. మండలంలోని గడ్డ మల్లయ్య గూడెం, గున్ గల్ గ్రామాలలో మంచిరెడ్డి కిషన్ రెడ్డి రోడ్ షో నిర్వహించి రోడ్ షోలో మాట్లాడుతూ .చేసిన అభివృద్ధి పనులు సిసిరోడ్లు, అండర్ డ్రైనేజీలు ఇంటింటికి మంచినీటి నల్ల, సంక్షేమ పథకాలు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, రైతుబంధు, రైతు బీమా, ఆసరా పింఛన్లు, అమ్మ ఒడి, కెసిఆర్ కిట్టు, ప్రజలకు వివరించారు. బిఆర్ఎస్ పార్టీ రూపొందించిన మేనిఫెస్టోను ప్రజలకు గడపగడపకు వివరించాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. గ్రామాలలో చేసిన అభివృద్ధిని ఏ గ్రామాలలో ఎంతెంత నిధులు తెచ్చి అభివృద్ధి పరిచారో వివరిస్తూ మరోసారి బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించి కారు గుర్తుకు ఓటు వేసి బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్ ,గ్రామ సర్పంచ్ కాశమల్ల ఇందిరా శ్రీనివాస్, పిఎసిఎస్ చైర్మన్ తోటి రెడ్డి రాజేందర్ రెడ్డి, జెడ్పిటిసి చిన్నోళ్ల జంగమ్మ యాదయ్య,బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కర్నాటి రమేష్ గౌడ్, పాచ్య భాష, రాజు నాయక్, ఉపసర్పంచ్ బీమ్, కాజు, బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు అచ్చన్న రమేష్, ప్రధాన కార్యదర్శి కుంటి శ్రీకాంత్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఆవ జంగయ్య, ప్రభాకర్ ,నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించాలి

- **బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మంచిరెడ్డి కిషన్ రెడ్డి**
- **కాగజ్ గట్ లో ఏడు కోట్ల 15 లక్షల రూపాయలు అభివృద్ధి**
- **ప్రభుత్వ భూమి 14ఎకరాలు**
- **300 ప్లాట్లు చేసి పేదవారికి ఇండ్ల స్థలాలు**

మంచాల - ప్రభాత సూర్యుడు



శాసనసభ ఎన్నికలలో భాగంగా మంచాల మండలంలోని ఆగపల్లి, కాగజ్ ఘాట్, జాపాల్, అస్మత్ పూర్, చాంద్ కాన్ గూడెం, పీసీ తండా, చెన్నారెడ్డి గూడ, ఆరుట్ల, గ్రామాల్లో పర్యటించి గ్రామాల ప్రజలకు బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలు గురించి జరిగిన, జరగబోయే అభివృద్ధి గురించి ప్రజలకు సవివరంగా వివరించారు. కాగజ్ గట్ లో ఏడు కోట్ల 15 లక్షల రూపాయల అభివృద్ధి జరిగిందని, ప్రభుత్వ భూమి 14 ఎకరాలు ఉందని ఇందులో 300 ప్లాట్లు చేసి పేదవారికి ఇండ్ల స్థలాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే అసైన్మెంట్ భూములు, లావణ్య భూములకు పట్టాలు ఇస్తామని ఆన్లైన్లో పేర్లు లేని వారికి ధరణి మీ పేర్ల మీద పట్టాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. దళిత బంధు 23శాతం దళిత కుటుంబాలకు 10 వేల కుటుంబాలకు ఎస్సీ బంధు మార్చి ఏప్రిల్ లో ముఖ్యమంత్రి కల్పిస్తారని అన్నారు. అదేవిధంగా మహిళలకు 3000 రూపాయలు, తెల్ల రేషన్ కార్డు ఉన్నవారికి కుటుంబంలో ఒక మహిళకు 5000 రూపాయల పెన్షన్, మార్చి నుండి సన్న బియ్యం, 400 రూపాయలకే గ్యాస్ సిలిండర్ పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు.

అదేవిధంగా ఎం కె ఆర్ ఫౌండేషన్ ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం, ఫాక్స్ కన్ కంపెనీలో నిరుద్యోగులకు 20 వేల ఉద్యోగాలు కల్పిస్తానని సభాముఖంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు చీరాల రమేష్ , ఎంపీపీ నర్మదా, మాజీ ఎంపీపీ మంకు ఇంద్ర,కాగజ్ ఘట్ సర్పంచ్ పి అండాలు వెంకటేష్, వార్డు మెంబర్ కందుకూరి పుష్పలత నాగేష్, ఎండి నవాజ్, రాజు, జాపాలకు చెందిన గ్రామ శాఖ అధ్యక్షులు ఉడతల నాగరాజు, ప్రధాన కార్యదర్శి సంజీవ, రామ్ రెడ్డి, నోముల కుమార్, సతీష్, చందు, అస్మత్ పూర్ సర్పంచ్ హరి ప్రసాద్, గ్రామ శాఖ అధ్యక్షుడు పుట్టసత్యం, చాంద్ కాన్ గూడ గ్రామ అధ్యక్షుడు గణేష్, ఆయా గ్రామాలకు చెందిన నాయకులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మరోసారి

# బిఆర్ఎస్ పార్టీని మంచిరెడ్డి కిషన్ రెడ్డిని గెలిపిద్దాం

**- ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఎస్సీ సెల్ ప్రధాన, కార్యదర్శి బొర్ర రమేష్(టిల్లు)**
**- తెలంగాణ అభివృద్ధిని ముందుకు నడిపిద్దాం, -కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలను నమ్మం, అంటున్న ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ప్రజలు**
**- డబ్బులకు,నోట్ల కట్టలకు అమ్ముడుపోయే వాళ్ళం , కాదు మేము గులాబీ జెండా సైనికులం,-కారు గుర్తుకే ఓటేద్దాం మంచిరెడ్డి కిషన్ రెడ్డినిగెలిపిద్దాం**

ఇబ్రహీం పట్నం - ప్రభాత సూర్యుడు



దేశంలో ఎక్కడ లేని సంక్షేమ పథకాలను తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ జీవితాల్లో వెలుగులు నింపారని ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బొర్ర రమేష్ (టిల్లు) ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ (టిల్లు) మాట్లాడుతూ రైతుబంధు,రైతు బీమా, దళిత బంధు,బీసీ బంధు, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, అమ్మఒడి, ఆరోగ్యలక్ష్మి, గృహలక్ష్మి, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లాంటి పథకాలు అమలు చేస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తున్నదని తెలిపారు. కాంగ్రెస్ ఓట్ల రాజకీయం చేస్తున్నదని, అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అమలు చేయని పథకాలను తెలంగాణలో అమలు చేస్తామని అసత్యపు ప్రచారాలు చేస్తున్నారని ప్రజలు ఇది గమనించాలని కోరారు. 6 గ్యారంటీలు కాదు 60 గ్యారంటీలు పెట్టినా చెయ్యికి ఓటు వేసే పరిస్థితి లేదని,ముఖ్యమంత్రి కేసీఆర్ తోనే సంక్షేమ పథకాల అమలు సాధ్యమవుతుందని ప్రజలు నమ్ముతున్నారని ఈ సందర్భంగా తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ మరోసారి అధికారం చేపట్టగానే గిరిజన బంధు,తెల్ల రేషన్ కార్డు గల ప్రతి ఒక్కరికి సన్నబియ్యం అందించడంతో పాటు ఐదు లక్షల రూపాయల బీమా సౌకర్యం అందుతుంది అన్నారు. 400 రూపాయలకే గ్యాస్ సిలిండర్ అంది స్తాము, ఆసరా పింఛన్లను ఐదువేలకు, వికలాంగుల పింఛన్లు 6000 రూపాయలకు పెంచుకు ంటున్నామని, రైతు బీమా తరహాలో 59 ఏండ్లలోపు కుటుంబ యజమాని చనిపోతే కారణాలతో సంబంధం లేకుండా ఎల్ ఐ సి నుంచి 5 లక్షలను నేరుగా ఆ కుటుంబానికి అందుతుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ మోస పూరిత మాటలు నమ్మి ఆగం కావద్దని వివరించారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్ రెడ్డి కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని రమేష్ (టిల్లు) పిలుపునిచ్చారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215